సాక్షి
పార్వతీపురం మన్యం
శుక్రవారం । 21 । ఏప్రిల్ । 2023



పాడి దిగుబడిపై వడదెబ్బ

గ్రామీణ ప్రాంతాలలో దాదాపు 60 నుంచి 70 శాతం మంది రైతులు వ్యవసాయ పంటల సాగుతో పాటు పాడిపశువుల పెంపకంపై దృష్టి సారిస్తారు.

- 8లో



మహిళా సాధికారతకు కృషి

మహిళలు అన్ని రంగాల్లో ముందుకెళ్తూ సాధికారత సాధించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నారని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు.

- 8లో

26న జాబ్‌మేళా

విజయనగరం ఫూల్‌బాగ్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈనెల 26న ఎస్.ఎస్.ఎస్.ఎస్ కళాశాలలో జాబ్‌మేళా జరగనుందని ఆర్‌ఐఓ మజ్జి సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022, 23 సంవత్సరంలో ఇంటర్మీడియట్‌లో మేథ్స్, బిజినెస్ మేథ్స్‌లో 75 శాతానికి మించి ఉత్తీర్ణత సాధించిన వారు జాబ్ మేళాకు అర్హులని పేర్కొన్నారు.



న్యూస్‌రీల్

అప్రమత్తతే ప్రధానం

- జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి కె.శ్రీనుబాబు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పార్వతీపురం టౌన్: వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి కె.శ్రీనుబాబు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాలు ముగింపు సందర్భంగా అగ్నిప్రమాదాల నివారణ చర్యలపై అగ్నిమాపక కేంద్రంలో గురువారం అవగాహన కల్పించారు. వంటగ్యాస్ ఉపయోగించే ముందుగా గాలి, వెలుతురు ఉండేలా చూసుకోవాలన్నారు. గ్యాస్ వినియోగించే ముందు 5 నిమిషాల పాటు తలుపులు, కిటికీలు తెరిచి ఉంచాలన్నారు. గ్యాస్ బండ ఉండే చోట ప్రమాదకరమైన వస్తువులు ఉంచరాదన్నారు. వంటపని పూర్తికాగానే గ్యాస్ రెగ్యులేటర్ ఆఫ్ చేయాలన్నారు. అగ్నిమాపక అధికారివారి ఫోన్‌నంబర్‌ను ప్రతిఒక్కరూ గుర్తించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

23న వాలీబాల్ రిఫరీ అర్హత పరీక్ష

విజయనగరం: ఆంధ్రప్రదేశ్ వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న విజయనగరం జిల్లాలోని కొత్తవలసలో వాలీబాల్ రిఫరీ అర్హత పరీక్ష నిర్వహించనున్నట్టు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి టి.వి.భగవాన్‌దాస్ గురువారం తెలిపారు. ఆ రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొత్తవలసలోని ప్రగతి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సెల్: 8919421590 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కుక్కల దాడిలో జింకపిల్ల మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన జింక పిల్లను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

గజపతినగరం రూరల్: గజపతినగరం మండలం సీతారామపురం గ్రామ పొలాల్లో గురువారం ఉదయం కుక్కల దాడిలో చుక్కలజింక పిల్ల మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు అటవీశాఖ అధికారి కె.వి.ఎస్.రాజు తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారామపురం గ్రామాన్ని ఆనుకుని ఉన్న ముద్దూరుకొండపై జింకలు గుంపులుగా ఉన్నాయన్నారు. గుంపు నుంచి తప్పిపోయిన జింక పిల్ల నీటికోసం పొలాల్లోకి వచ్చిందని, ఆ సమయంలో కుక్కలు దాడిచేయడంతో మృతిచెంది ఉంటుందన్నారు. పశువైద్యాధికారి ఆధ్వర్యంలో జింకపిల్ల కళేబరానికి పంచనామా జరిపి ఖననం చేశామన్నారు. ఆయన వెంట వీఆర్వో, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

జీసీసీని లాభాలబాట పట్టిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న జీసీసీ డీఎం మహేంద్ర

సాలూరు: జీసీసీను లాభాల బాట పట్టించేందుకు సమష్టిగా, సమన్వయంతో పనిచేద్దామని జీసీసీ డీఎం మహేంద్ర పిలుపునిచ్చారు. సాలూరు జీసీసీ కార్యాలయంలో మేనేజర్ రామారావు ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిబ్బంది అంతా సమయపాలన పాటించాలన్నారు. 2023–24 లక్ష్యాలు, చింతపండు కొనుగోలు, గతేడాది, నేటి లక్ష్యాల ప్రగతి, వ్యత్యాసాల చర్చించారు. గిరిజనుల నుంచి అటవీ ఉత్పత్తుల మొత్తం జీసీసీయే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రేషన్ పంపిణీపై సమన్వయంతో పనిచేయాలన్నారు. సిబ్బంది పనితీరుపై ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు.

విభిన్న ప్రతిభావంతులకు

ప్రోత్సాహకాలు

- జిల్లాలో భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక శిక్షణ
- విద్య, ప్రయాణ, సంరక్షకుల భత్యాల చెల్లింపునకు నిధుల విడుదల
- అర్హుల బ్యాంకు ఖాతాలకు నేరుగా నగదు జమ
- అలవెన్సులకు అర్హత పొందినవారు: 799 మంది
- విడుదలైన మొత్తం రూ.20,41,000



పాలకొండ భవిత కేంద్రంలో సేవలు పొందుతున్న విభిన్న ప్రతిభావంతులు

పాలకొండ రూరల్:

ప్రత్యేక అవసరాలు గల పిల్లల భవిష్యత్తుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బంగారు బాటలు వేస్తోంది. భవిత కేంద్రాల్లో ప్రత్యేక శిక్షకులతో శారీరక, మానసిక వికాస థెరపీలు అందిస్తోంది. ఆటపాటలతో కూడిన విద్యను బోధిస్తోంది. కదలలేని, సక్రమంగా మాట్లాడలేని, ఇతర ప్రత్యేక పరిస్థితుల్లో ఉన్న విభిన్నప్రతిభావంతులకు సమగ్రశిక్ష ద్వారా ప్రత్యేక సేవలు అందిస్తోంది. వారి అవసరాలు తీర్చుకునేందుకు ఉపయోగపడే అధునాతన పరికరాలను సమకూర్చుతోంది. పిల్లలు, వారి సంరక్షకులకు వివిధ రకాల అలవెన్సులను తాజాగా విడుదల చేసింది. నేరుగా అర్హతగల పిల్లల, వారి సంరక్షకుల



ఘటాలదెప్పి వీధికి చెందిన షర్మిలకు హోమ్‌బేస్‌డ్ ఎడ్యుకేషన్ అందిస్తున్న ఐఈఆర్టీ అరుణ

బ్యాంకు ఖాతాలకు జమయ్యాయాలేదా అన్న విషయాన్ని జిల్లా యంత్రాంగం పర్యవేక్షిస్తోంది.

ప్రోత్సాహకాలు విడుదల

పార్వతీపురం మన్యం జిల్లాలో 15 భవిత కేంద్రాలు ఉన్నాయి. వీటిద్వారా 1,478 మంది విభిన్న ప్రతిభావంతులు సేవలు పొందుతున్నారు. వీరిలో బాలురు 628 మంది, బాలికలు 850 మంది ఉన్నారు. ప్రభుత్వం ఇచ్చే అలవెన్సులకు అర్హత పొందిన బాల, బాలికలు 799 మంది ఉన్నట్టు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. వీరికి గత నాలుగేళ్లగా అందించాల్సిన ట్రాన్స్‌పోర్టు, హోమ్ బేస్‌డ్ ఎడ్యుకేషన్, ఎస్కార్టు, బాలికల ప్రత్యేక అలవెన్సును ప్రభుత్వం తాజాగా విడుదలచేసింది. భవిత కేంద్రాలకు వచ్చే పిల్లల ట్రాన్స్‌పోర్టు అలవెన్సులకు సంబంధించి 180 మంది లబ్ధిపొందగా ఒక్కొక్కరికి రూ.3వేలు చొప్పున రూ.5,40,000, బాలికల ప్రత్యేక స్టైఫండ్ కింద 356 మందికి రూ.2000 చొప్పున రూ.7,12,000, హోంబేస్‌డ్ ఎడ్యుకేషన్ (మంచానికి పరిమితమై ఇళ్ల వద్ద బోధన పొందుతున్న) 110 మందికి రూ.3వేల చొప్పున రూ.3,30,000 విడుదలైంది. దీంతోపాటు తమకు తాముగా నడవలేని, అంధత్వ, ఇతర సమస్యలతో ఇబ్బందులు పడుతూ తల్లితండ్రుల, సంరక్షకుల సహాయంతో బడికి, భవిత కేంద్రాలకు వచ్చే 153 మంది పిల్లలకు ఎస్కార్ట్ అలవెన్స్ రూ.3వేల చొప్పున రూ.4,59,000 విడుదల చేసింది. నాలుగు రకాల అలవెన్సులు కలిపి రూ.20,41,000 విడుదలయ్యాయని, ఈ నగదును అర్హుల బ్యాంకు ఖాతాలకు నేరుగా ప్రభుత్వం జమచేసినట్టు సంబంధిత అధికారులు తెలిపారు.

జిల్లాలో భవిత కేంద్రాల వివరాలు	
కేంద్రాలు:	15
సేవలు పొందుతున్నవారు:	1478
బాలురు:	628
బాలికలు:	850
ఫిజియో థెరపిస్టుల సంఖ్య:	5
ఐఈఆర్టీలు:	23
ఆయాలు:	15 మంది

అర్హుల ఖాతాలకే నిధులు



జిల్లాలో 799 మంది పిల్లలు నాలుగు రకాల అలవెన్సులు పొందేందుకు అర్హత పొందారు. అలవెన్సుల రూపంలో అందించాల్సిన మొత్తం రూ.20లక్షల41వేలును ప్రభుత్వం విడుదల చేసింది. పిల్లల అర్హతల మేరకు వారికి కేటాయించబడిన మొత్తాలు అర్హుల బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వమే జమ చేసింది. ప్రస్తుతం అర్హుల జాబితాల మేరకు మా సిబ్బంది క్షేత్రస్థాయిలో ఆ సొమ్ము పిల్లల ఖాతాల్లో వచ్చిచేరిందా లేదా అనే అంశాన్ని పరిశీలిస్తున్నారు. సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తాం.

– పి.భానుమూర్తి, సహితవిద్య జిల్లా సమన్వయకర్త, పార్వతీపురం మన్యం

ఏకలవ్య పాఠశాలలో కరోనా నిర్ధారణ పరీక్షలు

మక్కువ: మండలంలోని ఎర్రసామంతవలస ఆశ్రమపాఠశాల ఆవరణలోని ఏకలవ్య పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులకు కోవిడ్ లక్షణాలు బయటపడిన విషయం తెలిసిందే. దీంతో జిల్లా వైద్య యంత్రాంగం అప్రమత్తమైంది. పాఠశాలకు చెందిన 131 మంది విద్యార్థులకు గురువారం శంబర పీహెచ్‌సీ వైద్యాధికారి రఘు ఆధ్వర్యంలో సిబ్బంది కరోనా నిర్ధారణ పరీక్షలు చేశారు. వీరిలో 9 మందికి కోవిడ్ లక్షణాలు ఉన్నట్టు నిర్ధారించారు. అందరినీ పాఠశాల ప్రత్యేక తరగతి గదిలో ఐసోలేషన్‌లో ఉంచి, అవసరమైన మందులు అందజేస్తున్నారు. ఆరోగ్యజాగ్రత్తలు వివరించారు. చిన్నారుల ఆరోగ్యం నిలకడగానే ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యాధికారి రఘు తెలిపారు. ఏకలవ్య పాఠశాల పక్కనే ఉన్న ఆశ్రమ పాఠశాలకు చెందిన కొందరు విద్యార్థులకు కూడా కరోనా నిర్ధారణ పరీక్షలు జరిపారు. ఏఒక్కరిలోనూ కరోనా లక్షణాలు లేకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

అప్రమత్తంగా ఉండండి

సాలూరు: కోవిడ్ కేసులు నమోదవుతున్న వేళ ప్రజలను అప్రమత్తం చేస్తూ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది సేవలందించేందుకు సిద్ధం కావాలని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర సూచించారు. ఎర్రసామంతవలసలోని ఏకలవ్య పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు కరోనా లక్షణాలతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకుని ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్, పాఠశాల ప్రిన్సిపాల్, డీఎమ్‌హెచ్‌ఓలతో గురువారం ఫోన్లో మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. జిల్లాప్రజలందరూ కోవిడ్ నిబంధనలు పాటించాలన్నారు.



ఏకలవ్య పాఠశాలలో విద్యార్థికి కోవిడ్ నిర్ధారణ పరీక్ష చేస్తున్న వైద్యసిబ్బంది

అందరూ ఆరోగ్యంగానే ఉన్నారు

పార్వతీపురంటౌన్: కరోనా లక్షణాలు కనిపించిన ఏకలవ్యపాఠశాల విద్యార్థులందరూ ఆరోగ్యంగానే ఉన్నారని జిల్లా ఇన్‌చార్జి వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ధవళ భాస్కరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలోని మొత్తం 131 మంది విద్యార్థులకు కోవిడ్ నిర్ధారణ పరీక్షలు చేయగా 122 మందికి నెగిటివ్ వచ్చిందన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని పీహెచ్‌సీ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ఐటీడీఏ పీఓ విష్ణు చరణ్ పాఠశాలకు వెళ్లి స్వయంగా పరిశీలించారని చెప్పారు.

పాన్‌కార్డు తప్పనిసరి

- స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ బాలకృష్ణ

సాక్షి, విశాఖపట్నం : ఆదాయపు పన్ను ఆర్థిక లావాదేవీల స్టేట్‌మెంట్ (ఎస్ఎఫ్‌టీ) దాఖలు చేసేటప్పుడు రూ.10 లక్షలు పైబడిన ప్రతి లావాదేవీలకు కచ్చితంగా పాన్ నంబర్ అవసరమని రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ జి.బాలకృష్ణ స్పష్టం చేశారు. విశాఖలోని ఆదాయపు పన్ను శాఖ కార్యాలయంలో ఎస్ఎఫ్‌టీ ఫైలింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాలకు సంబంధించి స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖకు చెందిన జిల్లా రిజిస్ట్రార్లు, సంయుక్త సహాయ రిజిస్ట్రార్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఐజీ బాలకృష్ణ మాట్లాడుతూ ఆదాయపు పన్నుశాఖ సూచనల మేరకు ఎస్ఎఫ్‌టీ పొందుపరిచే సమయంలో తప్పులు దొర్లకుండా జాగ్రత్తపడాలని సూచించారు. ఐటీ శాఖ ఇంటిలిజెన్స్ అండ్ క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ అధికారి ఎంవీఎన్ఎస్ భవన్నారాయణ మాట్లాడుతూ స్థిరాస్తుల విక్రయాలు, కొనుగోళ్లకు సంబంధించి రూ.30 లక్షలు విలువ మించిన లావాదేవీల సమాచారాన్ని ఎలాంటి తప్పులు లేకుండా పొందుపరచాలన్నారు. వీటికి సంబంధించిన స్టేట్‌మెంట్స్ ఫైల్ చేసేందుకు మే 31వ తేదీ తుది గడువు అని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ అధికారులు పాల్గొన్నారు.



హాజరైన ఆరు జిల్లాల రిజిస్ట్రార్లు, సంయుక్త సహాయ రిజిస్ట్రార్లు

జగన్ పాలనకు జనం నీరాజనం

- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు జనం నీరాజనాలు పలుకుతున్నారని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. సాలూరు పట్టణంలోని తన స్వగృహంలో స్థానిక విలేకరులతో ఆయన గురువారం మాట్లాడారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోని 15,004 సచివాలయాల పరిధిలో గడపగడపకు మనప్రభుత్వం, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. జగనన్న పాలనలో జరిగిన మేలును ప్రజలు సంతోషంగా చెబుతున్నారన్నారు. పార్టీలకతీతంగా, అర్హతే ప్రామాణికంగా, అత్యంత పారదర్శకంగా, అవినీతి రహితంగా జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజాసంక్షేమ, అభివృద్ధి పాలనను చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. 2014లో బాబువస్తే జాబు వస్తుందంటూ చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. ఎన్నికలు వస్తున్న వేళ.. మరలా అదే మాటతో ప్రజలను మభ్యపెట్టే యత్నం చేస్తున్నారన్నారు. ఎవరి హయాంలో మేలు జరిగిందో ప్రజలకు తెలుసని, టీడీపీ నాయకులు చెప్పే మాయమాటలను నమ్మే పరిస్థితిలో ఎవరూ లేరన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సుమారు నాలుగు లక్షల కోట్ల ప్రజాధనాన్ని అవినీతి చేశారంటూ నాడు పవన్‌కళ్యాణ్ ఆరోపించారని, నేడు ఆ విషయాన్ని ఎక్కడా ఆయన ఎందుకు ప్రస్తావించడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల వేళ ఒకలా, మిగిలిన సమయాల్లో మరోలా ఉండరాదన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

మామిడి రైతులకు మేలు



జగన్నాథవలసలో నిర్మించిన గోదాము, కోల్డ్‌స్టోరేజ్‌ను పరిశీలిస్తున్న గుంటూరు ఉద్యానవన శాఖ ఎ.డి. రత్నాచార్యులు, తదితరులు

- గుంటూరు ఉద్యానవన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రత్నాచార్యులు

తెర్లాం: జిల్లాలోని పలు మండలాల్లో ఉద్యానవన శాఖ, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్మించిన మామిడి కాయల కలెక్షన్ సెంటర్ గోదాములు, కోల్డ్ స్టోరేజ్‌లతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందని గుంటూరు జిల్లా ఉద్యానవనశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వి.రత్నాచార్యులు అన్నారు. తెర్లాం మండలం గోపాలవలస పంచాయతీ జగన్నాథవలస గ్రామంలో నిర్మించిన మామిడి కాయల కలెక్షన్ సెంటర్ గోదాము, కోల్డ్ స్టోరేజ్‌లను గుంటూరు జిల్లా ఉద్యానవన శాఖ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. మండల రైతు ఉత్పత్తిదార్ల సంఘం అధ్యక్షులు, బోర్డు సభ్యులతో సమావేశమయ్యారు. గోదాముల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకొనే చర్యలు చేపట్టిందన్నారు. రైతులు గిట్టుబాటు ధర వచ్చేంత వరకు పంటను కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వఉంచుకోవచ్చన్నారు. మార్కెటింగ్‌పై మామిడి రైతుల సంఘ సభ్యులకు సూచనలిచ్చారు. ఆయన వెంట జిల్లా ఉద్యానవన శాఖ అధికారులు శైలజ, మోహన్‌కృష్ణ, ఎఫ్‌పీఓ మండలాధ్యక్షుడు వెంకటరావు, వెలుగు ఏపీఎం టి.రాము, బోర్డు డైరెక్టర్లు ఉన్నారు.

రుణాల మంజూరులో మన్యం ముందంజ

పార్వతీపురం: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహనిర్మాణ లబ్ధిదారులకు రుణాలు మంజూరులో పార్వతీపురం మన్యం జిల్లా రాష్ట్రంలోనే ముందంజలో ఉండడం అభినందనీయమని గృహనిర్మాణ సంస్థ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ అన్నారు. కలెక్టర్లతో గురువారం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. మే 31 నాటికి గృహాల నిర్మాణంలో సాధ్యమైనంత ఎక్కువ ప్రగతి సాధించాలన్నారు. చిరుధాన్యాల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్‌రెడ్డి సూచించారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన వినతుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధచూపాలన్నారు. వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నిశాంత్‌కుమార్, పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్, డీఆర్వో జె.వెంకటరావు, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రూ.లక్షల్లో జీతాలు తీసుకుని...

చదువు చెప్పకపోతే ఎలా?

- ఉపాధ్యాయులను ప్రశ్నించిన ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్
- విద్యాశాఖ పనితీరుపై మండిపాటు
- ప్రభుత్వ పాఠశాలల్లో కనీస బోధన లేదంటూ అసంతృప్తి
- పనిచేయని ఉపాధ్యాయులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?
- డీఈఓ, ఎంఈఓలను ప్రశ్నించిన ప్రిన్సిపాల్ సెక్రటరీ

పాలకొండ:

పాలకొండ మండలం కొండాపురం ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 90 మంది విద్యార్థులు చదువుతున్నారు.. వీరికి బోధించేందుకు నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారు.. ఏడాదికి జీతాల రూపంలో ప్రభుత్వం రూ.40లక్షలు చెల్లిస్తోంది... విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పరీక్షిస్తే శూన్యం.. కనీసం వర్క్‌బుక్‌లలో ఖాళీలు కూడా పూరింపజేయలేదు.. సర్కారు బడుల్లో చదువుతున్న పేదకుటుంబాల పిల్లలకు చదువులు చెప్పేది ఇలాగేనా?.. వారి భవిష్యత్ ఏమవుతుందంటూ విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖ అధికారుల పనితీరు, లోపాలను ఎత్తిచూపారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు లోపభూయిష్టంగా చదువులు చెబుతున్నారన్నారు. కొండాపురం గ్రామంలో గురువారం రాత్రి ఆయన పర్యటించారు. ప్రభుత్వ పాఠశాలలో చవదువుతున్న పలువురు విద్యార్థుల ఇళ్లకు వెళ్లారు. తొలుత నాలుగవ తరగతి చదువుతున్న రేవతి అనే విద్యార్థిని ఇంటికి వెళ్లి అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. సదరు విద్యార్థిని వర్క్‌బుక్స్ పూర్తిగా ఖాళీగా ఉండడంతో పాఠశాల హెచ్‌ఎం నందియ్యను ప్రశ్నించారు. మీరు ఎందుకు విద్యాబోధన సక్రమంగా పనిచేయడం లేదని సూటిగా ప్రశ్నించారు. పాఠశాలలో బోధన సక్రమంగా జరగకపోతే కనీసం తనిఖీలు చేయటం లేదా అని ఎంఈఓ సూర్యనారాయణపై మండిపడ్డారు. ఇంత వరకు జిల్లాలో ఎన్ని పాఠశాలలు తనిఖీ చేశారు... సమస్యలపై తీసుకున్న చర్యలేమిటని డీఈఓ, ఆర్‌జేడీలను ప్రశ్నించారు. చర్యలు తీసుకుంటే ఉపాధ్యాయ సంఘాలు తనపై ఒత్తిడి తీసుకువస్తాయని డీఈఓ ఎస్‌డీవీ రమణ చెప్పడంతో, అయితే.. నీవు ఏం పనిచేస్తున్నావని మందలించారు. నేరుగా మేము మీ శాఖకు బోధన, పాఠశాలలో పరిశీలన, సమస్యలపై తీసుకోవాల్సిన చర్యలపై వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తున్నా క్షేత్రస్థాయిలో ఆశించిన మేర ఫలితం కనిపించకపోవడం, ప్రభుత్వ ఆదేశాలు అమలు కాకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఆయన వెంట ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి, సబ్‌కలెక్టర్ నురూల్‌కమర్, వివిధ శాఖల జిల్లా అధికారులు ఉన్నారు. అనంతరం వైద్యశాఖ తీరుపై పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేయడం విశేషం.



బోధన సరిగా లేకపోవడంపై ఆర్‌జేడీ, డీఈఓ, పాఠశాల హెచ్‌ఎంను ప్రశ్నిస్తున్న ప్రవీణ్‌ప్రకాష్

రేగులపాడు కేజీబీవీ ఆకస్మిక తనిఖీ

వీరఘట్టం: మండలంని రేగులపాడు కేజీబీవీని ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ గురువారం రాత్రి 10.20 నిమిషాలకు సందర్శించారు. 8వ తరగతి విద్యార్థినుల గణిత అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. ఆ సమయంలో చాలామంది బాలికల వద్ద పాఠ్యపుస్తకాలు లేకపోవడంతో సిబ్బందిని ప్రశ్నించారు. పాఠ్యపుస్తకాలు ఎందుకు సరఫరా చేయలేదని డీఈఓ ఎస్‌డీవీ రమణ, వీరఘట్టం ఎంఈఓ కృష్ణమూర్తిని వివరణ అడిగారు.ఎంఈఓపై చర్యలకు ఆదేశించారు. ఇంటర్మీడియట్, పాఠశాల ఆర్‌జేడీలు శారద, జ్యోతికుమారి పాల్గొన్నారు.



వీరఘట్టం: రేగులపాడు కేజీబీవీలో బాలికల అభ్యసనా సామర్థ్యాలను పరీక్షిస్తున్న ప్రవీణ్ ప్రకాష్

క్లుప్తంగా

30 వరకు కేజీబీవీలో ప్రవేశ గడువు పొడిగింపు

పార్వతీపురం టౌన్: కస్తూరిబా బాలికా విద్యాలయాల్లో ప్రవేశాల గడువును ప్రభుత్వం ఈనెల 30 వరకు పొడిగించిందని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌డీ రమణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశాలకు 30వ తేదీవరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు ఉంటుందని తెలిపారు. పేద, అనాథ, బడిబయట పిల్లలు, మధ్యలో బడిమానేసిన బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామన్నారు. దరఖాస్తులను హెచ్‌టీటీపీఎస్://ఏపీకేజీబీవీ. ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్/వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థినులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం పంపిస్తామని తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

గజపతినగరం: మండలంలోని గుడివాడ గ్రామానికి చెందిన బుత్తల శ్రీను 18వ తేదీ నుంచి కనిపించడం లేదని భార్య కాంతమ్మ గజపతినగరం పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేసిందని స్థానిక ఎస్సై గంగరాజు తెలిపారు.ఈ మేరకు గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల18వ తేదీన ఇంటినుంచి బయటకి వెళ్లిన తన భర్త శ్రీను నేటికి ఇంటికి చేరలేదని భార్య కాంతమ్మ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

గొలుసు దొంగ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై మురళి

విజయనగరం క్రైమ్: మార్నింగ్ వాకింగ్ చేస్తున్న స్వాతి అనే మహిళ మెడలో బంగారు చైన్ లాక్కుని పరారైన సంఘటనకు సంబంధించి ఓ నిందితుడిని వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించి గురువారం ఉదయం పట్టణంలో ఆటోలో వెళ్తున్న ఏలూరు టౌన్‌కు చెందిన గగ్గలోతు యేసును, ఓ మైనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. ఆటో సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మురళి తెలిపారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



శంకరరావు(ఫైల్)

భోగాపురం: మండలంలోని మహారాజుపేట గ్రామానికి చెందిన మద్దిల శంకర రావు(41) శంకర రావు మనస్తాపంతో గురువారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శంకరరావు ఆటో నడుపుకుంటూ భార్య ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నాడు. వారం రోజుల క్రితం ఆటోలో సామాన్లు పోయాయంటూ ఓ వ్యక్తి శంకరరావుపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు చేసిన నాటి నుంచి నుంచి తమ కుటుంబానికి బెదిరింపులు వస్తున్నాయని ఆ కారణంగానే తన భర్త మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో ఉరివేసుకున్నాడని భార్య పావని పోలీసులకు తెలిపింది. మృతుడి భార్య పావని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సూర్యకుమారి తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

గంట్యాడ: మండలంలోని తాటిపూడి గ్రామంలో జరిగిన హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. తన భార్యను కాపురానికి పంపించడం లేదనే కోపంతో మామ అప్పలస్వామిపై మంగళవారం రాత్రి అల్లుడు పడాల సత్యనారాయణ కత్తితో దాడి చేశాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన మామ అప్పలస్వామి అక్కడికక్కడే మృతిచెందాడు. మామ మృతి చెందడంతో అల్లుడు సత్యనారాయణ పరారయ్యాడు. నిందితుడిని గ్రామ సమీపంలో గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తిరుపతి రావు తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 375.00
విజయనగరం	రూ. 379.00
శ్రీకాకుళం	రూ. 379.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,930–00
బంగారం(22సి. 10గ్రా.)	55,850–00
వెండి (కిలో)	81,000–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹118	₹206	₹ 216

పాడి దిగుబడిపై వడదెబ్బ

- కొద్దిపాటి జాగ్రత్తలతో పాడిపశువుల సంరక్షణ



వేపాడ: ఎండలో మేస్తున్న పశువులు



వేపాడ: చెట్ల నీడలో పశువులకు రక్షణ కలిస్తున్న రైతు

రామభద్రపురం/వేపాడ: గ్రామీణ ప్రాంతాలలో దాదాపు 60 నుంచి 70 శాతం మంది రైతులు వ్యవసాయ పంటల సాగుతో పాటు పాడిపశువుల పెంపకంపై దృష్టి సారిస్తారు. అయితే వాటి సంరక్షణలో మెలకువలు తెలియక ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోక నష్టాపాలవుతారు. వేసవిలో పాడిపశువులకు వడదెబ్బ తగిలితే పాల దిగుబడి తగ్గడమే కాక పాడి పశువులు ఎదకు వచ్చే పరిస్థితులు కనిపించవని, అంతే కాక పశువు చూడికట్టే అవకాశం ఉండదని పశువైద్యాధికారులు చెబుతున్నారు. వేసవిలో పాడి ఆవులు, గేదెల సంరక్షణపై రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోకపోతే వడదెబ్బకు గురై ఒక్కోసారి పశువు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

పాడి రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు

వేసవిలో పశువులు తాగే నీరు స్వచ్ఛంగా పరిశుభ్రంగా ఉండాలి. వేసవిలో సహజంగానే నీటి వనరులు తగ్గి నిల్వ ఉండే నీరు మురికిగా, ఆకుపచ్చగా మారుతుంది. పశువులు ఈ కలుషితమైన నీరు తాగితే వ్యాధికారక క్రిములు శరీరంలో చేరి పారుడు వ్యాధులు కలుగుతాయి. కాబట్టి పశువులు తాగేందుకు స్వచ్ఛమైన నీటిని ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలి. రోజులో కనీసం మూడు సార్లు నీటిని అందించడం అవసరం. ఆరుబయట తొట్టెల్లో పగలు నిల్వ ఉన్న నీరు వెచ్చగా మారతాయి. నీడ ప్రాంతంలో నిల్వ ఉంచిన చల్లటి నీటినే తాగించాలి. అవులతో పోలిస్తే గేదెలు ఎక్కువ నీరు తాగుతాయి. వాతావరణ ఉష్ణోగ్రత, గాలిలో తేమ, పశువు వయసు తదితరాలను బట్టి రోజుకు సుమారు 28 లీటర్ల నీరు అవసరమవుతాయి. పాలిచ్చే పశువులు అదనంగా ప్రతి లీటరు దిగుబడికి నాలుగు లీటర్లు చొప్పున నీటిని తాగుతాయి.



ఎల్.విష్ణు పశు సంవర్ధక శాఖ ఎ.డి

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

పశువులకు వడదెబ్బ తగలకుండా ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పశువుల పాక చుట్టూ పాత గోనెలు కట్టి వాటిని అప్పడప్పుడూ తడుపుతూ ఉండాలి. పైకప్పును కొబ్బరి కమ్మలతో గానీ, ఎండు గడ్డితో గానీ కప్పాలి. మంచినీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలి. పశువులను ఉదయం, సాయంత్రం చల్లని వాతావరణంలోనే మాత్రమే మేత కోసం విప్పాలి. పశువులు ఎక్కువగా ఎండలో తిరగకుండా చూడాలి. వీలైనంత పచ్చని మేతను ఇవ్వాలి. సంకరజాతి ఆవులైతే పంకాలు ఏర్పాటు చేయాలి.

వడదెబ్బకు గురైతే లక్షణాలు ఇలా..

వడదెబ్బకు గురైన పశువు లక్షణాలను పరిశీలిస్తే శరీర ఉష్ణోగ్రత 101 డిగ్రీల నుంచి 108 డిగ్రీల వరకు పెరుగుతుంది.పశువులు నడిచేటప్పుడు తూలుతాయి. శ్వాసక్రియ ఎక్కువగా ఉంటుంది. పశువు చాలా నీరసంగా కనపడుతుంది. ఒక్కోసారి కిందపడి కొట్టుకుని స్పృహకోల్పోతాయి. పశువు నీటి కోసం చూస్తుంటుంది. చర్మం ఎండిపోయినట్లు ఉంటుంది. పాడి పశువు అయితే పాల ఉత్పత్తి పడిపోతుంది. ఇటువంటి లక్షణాలు ఉంటే వడదెబ్బ తగిలిందని రైతు గ్రహించాలి.



రామభద్రపురం: తారాపురంలో పాడి ఆవుకు పాలు పితుకుతున్న మహిళా రైతు



రామభద్రపురం: పశువైద్యశాలలో పాడిపశువును పరీక్షిస్తున్న పశువైద్యాధికారిణి హిరణ్య

పశువుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ



వేసవిలో పాడిపశువుల సంరక్షణపై రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. వడదెబ్బ తగిలిన పశువును రైతులు గుర్తించిన వెంటనే చల్లని నీటితో ముఖాన్ని కడగాలి. గుడ్డతో ఐస్ చుట్టి పశువు నుదుటిపై ఒత్తాలి. కొద్ది ఊరట కలిగిన తరువాత దగ్గరలో ఉన్న పశువైద్యుడిని సంప్రదించి సెలైన్‌లు పెట్టాలి.ఒక్కసారి వడదెబ్బ తగిలిన పశువుకు బతికినంతకాలం పాల దిగుబడి గతంలో మాదిరిగా ఉండదు. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే మంచిది.

ఎల్ విష్ణు, పశుసంవర్ధక శాఖ ఎ.డి. బొబ్బిలి
బి.చలపతిరావు, ఎ.డి ఎస్.కోట

మూడు గడ్డివాములు దగ్ధం



గర్భాంలో కాలిపోతున్న గడ్డివాములు

మెరకముడిదాం: మండలంలోని గర్భాంలో గురువారం జరిగిన అగ్నిప్రమాదంలో మూడు గడ్డివాములు ధగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన కాజులు కళ్లాల్లో పల్లేడరాములు, పల్లేడలక్ష్మణ, పల్లేడబంగారయ్యలకు చెందిన మూడు గడ్డివాములు గురువారం మధ్యాహ్నం 2గంటల సమయంలో ఆహుతవుతుండడాన్ని గుర్తించిన కొందరు రైతులు మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నించారు. అయితే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ముగ్గురు రైతులకు చెందిన 15 బస్తాలు ధాన్యం గడ్డివాముల కింద దాచి ఉంచడంతో ఈ ప్రమాదంలో ధాన్యం కూడా కాలిబూడిదయ్యాయి.

రెండు షాపులు..

విజయనగరం క్రైమ్: స్థానిక వీటీ అగ్రహారం వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు షాపులు దగ్ధమయ్యాయి. సమాచారం మేరకర స్థానికులు, అగ్నిమాపక శాఖాధికారులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

మహిళా సాధికారత కోసం సీఎం జగన్ కృషి



మహిళలకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి: మహిళలు అన్ని రంగాల్లో ముందుకెళ్తూ సాధికారత సాధించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నారని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గల ఇందిర క్రాంతి పథం(వెలుగు) ఆధ్వర్యంలో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ సంస్థ సీఎస్ఆర్ విధానంలో జరుగుతున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఇంతవరకు రెండు బ్యాచ్‌లలో శిక్షణ పొందిన 60 మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అదే విధంగా కొత్తగా శిక్షణ కోసం వచ్చిన 30 మంది మహిళలకు కుట్టు పరికరాలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ మహిళలు సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా కుట్టు శిక్షణ కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఒక్కో బ్యాచ్‌కు 90 రోజుల పాటు కుట్టు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి శిక్షణ కోసం వేలాది రూపాయలు వెచ్చించి విజయనగరం, విశాఖపట్నం వంటి ప్రాంతాలకు మహిళలు వెళ్లాల్సి వచ్చేదన్నారు. కానీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఉచితంగా అదే శిక్షణను మహిళలు నివసించే ప్రాంతాల్లోనే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలోనూ కుట్టు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కుట్టు శిక్షణకు వచ్చే మహిళలకు మధ్యాహ్న భోజన వసతి కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఎంతో ఉపయోగకరమైన ఈ కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు కేవీ .సూర్యనారాయణరాజు, ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసులు నాయుడు, వెలుగు ఏసీ సీతారామయ్య, ఏపీఎం ఎంవి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు

- నాయీబ్రాహ్మణుల కృతజ్ఞత సభ
- హాజరైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

శృంగవరపుకోట: నాయీబ్రాహ్మణులకు తగిన గౌరవం, హోదా, కల్పించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపేందుకు గురువారం స్థానిక పుణ్యగిరి రోడ్డులో గల కమ్యూనిటీహాల్‌లో నాయీబ్రాహ్మణ సేవా సంఘం నియోజకవర్గ కన్వీనర్ కె.శ్రీనివాసరావు అధ్యక్షతన నాయీబ్రాహ్మణ కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేవాలయాల పాలకమండళ్లలో నాయీబ్రాహ్మణులకు తగిన ప్రాతినిధ్యం కల్పిస్తామని, ప్రభుత్వాలు పాలకులు దశాబ్దాల పాటు చెప్పారు. నేడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రాజ్యాంగస్ఫూర్తిని అమలు చేయడం వల్లనే జీఓ నంబర్ 50 వచ్చిందన్నారు. నాడు పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు సెలూన్లకు ఉచిత విద్యుత్, వైఎస్ఆర్ చేదోడు అమలు చేస్తున్నారని గుర్తుచేశారు. సీఎం చెప్పే ప్రతిమాట ఆచరణలో పెట్టి చూపుతారన్నారు. ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ జగన్ అన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత నాయీబ్రాహ్మణుల గౌరవం కాపాడేలా జీఓ నంబర్ 50 తెచ్చారని, వైఎస్ఆర్ చేదోడులో భాగంగా ఏడాదికి రూ.10వేలు, ఆలయాల ట్రస్టుబోర్డుల్లో నాయీ బ్రాహ్మణులకు అవకాశం కల్పించారన్నారు. కేశఖండన చేసే నాయీబ్రాహ్మణులకు నెలకు రూ.20వేల ఆదాయం వర్తించేలా ఇటీవల ఉత్తర్వులిచ్చి తన నిజాయితీని నిరూపించిన ముఖ్యమంత్రి జగన్ అని ప్రశంసించారు.

ఈ ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే

నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లాఅధ్యక్షుడు రామేశ్వరపు రామారావు మాట్లాడుతూ 2156 దేవాలయాల్లో తగిన గౌరవం కల్పించిన మహావ్యక్తి జగన్ అన్నారు. 25న నిర్వహించనున్న రాష్ట్ర సమావేశంలో దేవస్థాన పాలకమండళ్లలో స్థానం కల్పించే అంశంపై నిర్ణయం తీసుకోనున్నాం. 139కులాలలను ఏకం చేసి 56కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే అన్నారు. సెలూన్‌కి 150యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్, రూ.10వేల ఆర్థిక సాయం, అందిస్తున్నారని, నాయీబ్రాహ్మణులకు గౌరవం కల్పించేలా జీఓ నంబర్ 110 చట్టం చేశారని సంతోషం వెలిబుచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాసరావు, ఆతవ రమేష్, శానాపతి చంద్రరావు తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరరావు, జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ సుధారాజు, సర్పంచ్ సంతోషికుమారి, ఎంటీసీలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు. ఐదు మండలాల నాయీబ్రాహ్మణ సేవా సంఘాల కార్యవర్గ సభ్యులు, నాయకులను దుశ్శాలువలతో సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

సాలూరు: పట్టణంలోని దాసరివీధి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడుకు తీవ్రగాయాలపాలయ్యాడు. తీవ్రగాయాలతో యువకుడు ఉండడాన్ని గుర్తించిన స్థానిక యువత పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు అక్కడినుంచి విజయనగరం ఆస్పత్రికి రిఫర్ చేశారు. దీనిపై సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ, క్షతగాత్రుడు మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నాడని హిట్ అండ్ రన్‌కేసు నమోదుచేశామని తెలిపారు. వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

వ్యాన్‌ను ఢీకొని వ్యక్తికి...

శృంగవరపుకోట: మండలంలోని విశాఖ అరుకు రోడ్డులో కాపుసోంపురం వద్ద కుమార్తెతో బైక్‌పై వస్తున్న వ్యక్తి అదుపుతప్పి వ్యాన్ను ఢీకొట్టడంతో జరిగిన ప్రమాదంలో తీవ్రగాయాల పాలయ్యాడు. కాపుసోంపురం గ్రామానికి చెందిన దాసరి అప్పారావు తన ఐదేళ్ల కుమార్తె మధులితతో కలిసి బైక్‌పై ఎస్.కోట వస్తుండగా అదుపు తప్పి వస్తున్న వ్యాన్‌ను ఢీకొట్టాడు. ప్రమాదంలో అప్పారావు కుమార్తె స్వల్పగాయాలతో బయటపడగా, అప్పారావు కుడి కాలు పూర్తిగా ఛిద్రమైంది. దీంతో స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది వచ్చి ప్రాథమిక చికిత్స చేసి, విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించారు.



శృంగవరపుకోట: గాయాల పాలైన అప్పారావు

బైక్ ఢీకొని వృద్ధుడి మృతి



బొండపల్లి: సంఘటనా స్థలంలో గాయాలపాలైన వృద్ధుడు చిన్నయ్య

బొండపల్లి: మండలంలోని బిల్లలవలస జంక్షన్ వద్ద గురువారం వేకువ జామున ద్విచక్రవాహనం ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. మక్కువ మండలంలోని ఎం.వెంకంపేట గ్రామానికి చెందిన అలమండ చిన్నయ్య (85)ను ద్విచక్ర వాహన చోదకుడు ఢీకొట్టడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. దీంతో వృద్ధుడిని విజయనగరంలోని సర్వజన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై రవి కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుతో బాలుడు..



గరుగుబిల్లి: రుత్విక్ (ఫైల్)

గరుగుబిల్లి: మండలంలోని గొట్టివలసకు చెందిన బచ్చల రుత్విక్(7) పాముకాటుతో గురువారం తెల్లవారు జామున మృతి చెందాడు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో బచ్చల లక్ష్మి, చిన్నారావు దంపతులు కుమారుడు రుత్విక్, కుమార్తె రోహిణి నివాసం ఉంటున్నారు. అర్ధరాత్రి సమయంలో రుత్విక్‌ను పాముకాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురికాగా 108 వాహనంద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్సకోసం తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకోసం విశాఖపట్నం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. అల్లారు ముద్దుగా పెంచుకున్న కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

చెరువులోపడి బీటెక్ విద్యార్థి..





మృతిచెందిన సాయిభరత్ కుమార్, (ఇన్‌సెట్లో) సాయిభరత్ కుమార్ (ఫైల్)

పార్వతీపురం: స్నేహితులతో సరదాగా చెరువుకు స్నానానికి వెళ్లిన ఒడిశాకు చెందిన బీటెక్ విద్యార్థి చెరువులో పడిపోయి గురువారం సాయంత్రం మృతిచెందాడు. ఈ సంఘటనపై పార్వతీపురం రూరల్ ఎస్సై వై.సింహాచలం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎంఆర్ నగరంలో అమ్మవారి పండగకు స్నేహితుడు యలమంటి సంపత్ కుమార్ ఆహ్వానం మేరకు ఒడిశా రాష్ట్రంలోని రాయగడ జిల్లా గడశేశికల, కొలనార్ సమితికి చెందిన మరిశర్ల సాయిభరత్ కుమార్ (18) వచ్చాడు. స్నేహితులతో కలిసి గ్రామశివారున ఉన్న చెరువుకు స్నానం కోసం వెళ్లాడు. స్నానం చేస్తుండగా సాయిభరత్ ఒక గోతిలోపడి మునిగిపోవడాన్ని స్నేహితులు గమనించి వెంటనే బయటకు తీసి చికిత్స కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే సాయిభరత్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విశాఖపట్నంలోని అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో సాయిభరత్ బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. స్నేహితులతో సరదగా గడుపుదామని వచ్చిన సాయి భరత్ మృత్యువాత పడడంతో బంధువులు, కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సంఘటనపై జియ్యమ్మవలస మండలం రామినాయుడువలసకు చెందిన రెడ్డి స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అన్నపై పెట్రోల్ పోసి నిప్పంటించిన తమ్ముడు



ఆస్పత్రిలో కాలిన గాయాలతో గుణుపూరు కృష్ణ

బొబ్బిలి: పట్టణ పరిధిలోని పాత బొబ్బిలిలో నిద్రిస్తున్న అన్నపై తమ్ముడు పెట్రోల్ పోసి నిప్పంటించాడు. వివరాలిలా ఉన్నా యి. పాత బొబ్బిలిలో ఉంటున్న గుణుపూరు కృష్ణ, గోపాల్ అన్నదమ్ములు. వారి ఇళ్లు ముందూ వె నుకా ఉన్నాయి. వెళ్లేందుకు చిన్న సందు మాత్రమే ఉంది. ఈ గొడ వపై పంచాయతీ పెద్దలు రాజీ చేసే ప్రయత్నంలోనే పోలీసుస్టేషన్‌లో ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకున్నారు. ఈ క్రమంలో గురువారం తెల్లవారు జామున నాలుగు గంటల సమయంలో గుణుపూరు కృష్ణ నిద్రిస్తుండగా గోపాల్ పెట్రోల్ తీసుకు వచ్చి అన్నపై పోసి నిప్పంటించాడు. దీంతో ఒళ్లు కాలిపోయిన కృష్ణ పక్కనే ఉన్న కుండీలోని నీళ్లను వంటిపై చల్లుకున్నాడు. ఇంతలో కుక్కలు మొరగడంతో స్థానికులు మేలుకుని కాలిన గాయాలతో ఉన్న కృష్ణను స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి విజయనగరం కేంద్రాస్పత్రి, విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. స్థానికుల అలికిడి వచ్చేసరికి గోపాల్ పరారయ్యాడు. సంఘటన సమయంలో ఎస్సై జ్ఞానప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని, నిందితుడి కోసం గాలింపు చర్యలు ప్రారంభించామని సీఐ ఎం నాగేశ్వర రావు తెలిపారు.

వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థులతో సంభాషిస్తున్న ఎంఈఓ దుర్గారావు

వంగర: చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈఓ వై.దుర్గారావు తెలిపారు. గురువారం మండలంలోని కొప్పరవలస ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థుల హాజరు, రికార్డుల నిర్వహణ, విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం జగనన్న గోరుముద్ద పథకం కింద వండిన మధ్యాహ్న భోజన వంటకాలను రుచి చూసి పరిశీలించారు. మె నూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండిపెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అనూష తదితరులు పాల్గొన్నారు.